
# ప్రయాణ భారతంలో అనుభూతి పర్వం

- గౌతమి



నాకు గొప్ప రిలీఫ్‌గా వుంది! నిన్నటితో పరీక్షలు అయిపోయాయి. పరీక్షలు బాగా వ్రాసినందుకు సంతృప్తిగాను, గ్రాడ్యుయేట్‌ని అవబోతున్నందుకు ఆనందంగానూ వుంది. ఇన్నిరోజుల స్ట్రగుల్‌కి ఏదో ఒక రిక్రియేషన్ కావాలనిపించి నా కుటుంబసభ్యులందరితోటి సినిమా ప్రోగ్రాం పెట్టాను.

అన్నయ్యకు సాయంత్రం త్వరగా వచ్చే వీలులేక పోవటం మూలానా సెకండ్‌షోకి వెళ్ళదలిచాము. అమ్మా, నాన్నా, వదిన, అన్నయ్య ఇద్దరు పిల్లలు రెడీ అయ్యే ప్రయత్నంలో వున్నారు. అన్నయ్య వచ్చేలోపు తను కూడా రెడీ అవ్వాలి. రోజూ ధరించే చుడీదార్స్ ప్రక్కకు పెట్టి నాకిష్టమైన గులాబిరంగు చీర కట్టుకున్నాను. ఇంతలో అన్నయ్య రానే వచ్చాడు.

జనం పల్చగా వుండి, అందరూ కలిసి చూడదగ్గ ఒక సినిమాను ఎన్నుకున్నాము. థియేటర్లో మా సీట్స్ ఆక్రమించుకున్నాకా అందరి దృష్టి తెరమీదకు మళ్ళింది.

సినిమా మొదలయ్యింది సరికదా - మాకు రెండు వరసల అవతల కూర్చుని వున్న ఆరు ఏడు మంది యువకులు తమ ఉనికి థియేటర్లో అందరికీ తెలియాలన్నట్లు పెద్దగా కామెంట్స్ మొదలుపెట్టారు.

అన్నయ్య తన సీట్లో ఇరిటేటింగ్‌గా కదులుతున్నాడు. నాన్నగారైతే పదే పదే తల వెనక్కి త్రిప్పి ఉగ్రంగా చూస్తున్నారు. థియేటర్లో జనంయొక్క ఈ మౌన ప్రతిఘటనని ఏమాత్రమూ గ్రహించని ఆ యువకులు తమ ధోరణిలో అంతకంతకు రెచ్చిపోతున్నారు. ఏదో పాటలపుడు కాస్త ఉత్సాహపడి చప్పట్లు కొట్టడంకాక ఆద్యంతమూ గొడవ, గొడవ. కొన్ని ప్రేమ సన్నివేశాలకి అసభ్యకరంగా వ్యాఖ్యానించడందాకా సాగింది ఆ అల్లరి.

నా మనసులోని ఉల్లాసమంతా ఎగిరిపోయింది. మా సహనపు హద్దు కాస్తా చెరిగి, వాళ్ళ అల్లరిని అడ్డుకొనే ప్రయత్నానికి నాదీ ఒక వంతు అన్నట్టు అన్నయ్య, నాన్నతోటి చర్చలోకి దిగాను.

అమ్మ నామీద విరుచుకుపడింది.

"ఆడపిల్లని నీకింత వేగం పనికిరాదంటూ" నా నోరు మూయించింది.

"ఇంతమంది ఊర్కోగా లేంది మనకెందుకు వచ్చిన గొడవ? సగం సమయం ఎలాగూ గడిచింది. ఇంకో గంట ఎలాగోలా సర్దుకుంటే పోతుంది" అమ్మ తీర్మానించింది.

వదిన కూడా అమ్మని సపోర్ట్ చేస్తూ "వాళ్ళు అసలే ఆరితేరిన ఆకతాయిల్లాగా వున్నారు. చెబితే వినిపించుకునే రకమా - కదిలిస్తే గొడవే అవుతుంది. మనమా పిల్లలు, ఆడవాళ్ళతోటి వచ్చామాయే. అర్ధరాత్రి ఇంటికి వెళ్ళేదారిలో అటకాయిస్తే ఏం చెయ్యగలం? మనం చేసే పని చెల్లేదైతే ఫర్వాలేదు - కోరి కష్టాలు కొనితెచ్చుకోవటం అవివేకం కాదూ?" కాస్త తెలివిగా సర్దిచెప్పింది.

అందరం గంగిరెద్దుల్లాగా తలవంచుకోటానికే సిద్ధపడ్డాము.


నా మనసు సినిమాలోకం నుండి పలాయనం చిత్తగించింది. మెదడులో తర్కసామ్రాజ్యం విస్తరించింది.

సమాజంలో ఒకవంతు జనం ఓ తప్పుడు పనిని ఇంత నిర్భయంగా చేయగల్గుతున్నపుడు మూడు వంతుల జనం దాన్ని ఎదుర్కోటానికి అంత భయపడతారేం?

ప్రతి వ్యక్తీ నిర్భయంగా తన స్వేచ్ఛని ప్రకటించుకోలేదు కనుకనే కొంతమంది ఆ స్వేచ్ఛని బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారు. కనీసపు క్రమశిక్షణ కూడా లోపించినపుడు మనిషి కర్తవ్యాన్ని విస్మరించడం ... సంఘాన్ని నిర్వీర్యం చెయ్యడంలేదూ?

* * *

సరిగ్గా మళ్ళీ వారానికి ఇలాంటి సంఘటనే నా అనుభవంలోనికి వచ్చింది. నా స్నేహితురాలు రమ్య పెళ్ళికని అనంతపురం వెళ్ళే సందర్భంలో హైద్రాబాద్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కి అన్నయ్య నాకు టిక్కెట్ రిజర్వ్ చేశాడు. అనంతపురానికి రైలు ప్రయాణం అంటే మహబూబ్‌నగర్ వరకు లింకు ట్రైన్ పాట్లు తప్పవు.




కాచిగూడాలో తోసుకుని ఎక్కుతున్న జనసందోహంలో నుండి అన్నయ్య నన్ను నా రిజర్వుడు కంపార్టుమెంట్‌లో కూర్చోబెట్టాడు:

లింకు ట్రైన్

మూలాన జనం ఎడాపెడా ఎక్కేస్తున్నారు. మహబూబ్‌నగర్ నుండి ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో లేడీస్ కూపేలో సెటిలయ్యేదాక ఈ గడబిడ తప్పదు!

ట్రైన్ మెల్లగా కదిలింది. చెయ్యి ఊపుతున్న అన్నయ్య కనుమరుగయ్యాకా – కిటికీ గుండా ప్రకృతి అందచందాల్ని తిలకిస్తూ కూచున్నాను. నాసికను చేరుతున్న దుర్గంధం ఇబ్బంది పెడుతోంది. నా ఇబ్బందిని రెట్టింపు చేస్తూ ప్రక్క కంపార్టుమెంట్‌లో పైన చెప్పిన సినిమా థియేటర్లో యువకుల తాలూకా ఆప్తమిత్రులా అన్నట్టు ఇక్కడో పదిమంది అబ్బాయిలు చేరి రైలుని తమ సొంత ఇల్లులా భావించి అంత్యాక్షరి మొదలుపెట్టారు. కాసేపు పాడుకొని నోరునొప్పెట్టి ఊరుకుంటారుకదా అని అనుకున్నాను. అరగంట గడిచినా ఆ ఆట ముగిసే సూచనలు కనిపించలేదు. భీకరమైన గొంతులతో మంద్రస్థాయిలో బూతుపాటలు పాడుతుంటే చెవిల్లో కంకరకొడుతున్నట్టుగా వుంది. నా ఎదురుగా కూర్చున్న ఇద్దరు పిల్లలు ఈ అతీత శబ్దాల పాటకచేరికి బిగుసుకపోయి అల్లరి మరిచి బిక్కమొహాలు వేసేశారు. మిగతా జనం పరిస్థితి ఎంత అసౌకర్యంగా వున్నప్పటికీ తాము సహనానికి ప్రతీకలా అన్నట్టు మిన్నకుండిపోయారు.

నేను ఈసారి నా మనసులోనే తర్కించుకుంటూ వుండిపోకుండా మా కంపార్టుమెంట్‌లో జనాన్ని కాస్త కదిపాను. "ప్రక్కన అంత గొడవ చేస్తుంటే మీకు అశాంతిగా లేదూ?" ప్రశ్నించాను.

"వుంటే ఏం చెయ్యగలం తల్లీ – ఆ రౌడీ మూకతో ఎవరు తలపడగలరు?" ఓ పెద్దావిడ నిట్టూర్చింది.

మరో ఇద్దరు మధ్యవయస్కులు "కుర్రకారుతో అసలు పెట్టుకోకూడదు. వాళ్ళోచోట, మనమోచోట దిగిపోయేవాళ్ళమేగా ఈ కాస్తలో గొడవెందుకు ..." చెప్పబోయారు.

ఈ సర్దుబాటువాదానికి విసిగిపోయిన నేను కాస్త ఆవేశంగా అరిచాను.

"మీలో ఇంత నిరాసక్తత ఎందుకు?

సమాజంలో మనం కోల్పోతున్నదాని కొరకు పోరాటం సల్పనపుడు ఎందుకు స్వేచ్ఛ?

ప్రక్కన ఏమి జరుగుతున్నా పట్టించుకోని అవేర్‌నెస్ ఎందుకు మనిషిలో?

నడివీథుల్లో హత్యలు, ఊరూరా రాజకీయ కుమ్ములాటల్లో ముందుకు పరుగెడుతోన్న దేశం చిన్న చిన్న విషయాలకి తలవంచటం ఏం ప్రొగ్రెస్!

బస్సుల్లో ధూమపానం, కాలేజీల్లో ఈవ్‌టీజింగ్, ఎదుటివ్యక్తి బలహీనతల్ని కాష్ చేసుకుంటున్న దౌర్జన్యం ... వంటి తప్పదు పనుల్లో సంఘం తనని తను కోల్పోవటంలేదూ?

యువతలో విచక్షణని మేల్కొల్పడం అందరి ధర్మమూ కాదా?

ఓ తప్పదు పనిని నిలదీసి ప్రశ్నించండి.

నిజం మీవెంట వున్నపుడు అధైర్యాన్ని తరిమికొట్టండి.

సమాజంలో మీవంతు స్వేచ్ఛని పుష్కలంగా అనుభవించండి.

అడుగడుగునా ఎదురయ్యే ఆకతాయితనాన్ని అదుపులో వుంచటం మనవంతు పనిగా ఎందుకు స్వీకరించరు?

మీ అందరికన్నా వయసులో చిన్నదాన్నే అయినప్పటికీ నా మాట మన్నించి ప్రక్కన జరుగుతున్న ఆ అల్లరిని ఆపటానికి దయచేసి సహకరించండి" ఘాటుగా మొదలుపెట్టినా అర్థింపుగా ముగించాను.

నా వాదనలో సత్యాన్ని గ్రహించి, కాబోలు నేనెక్కువగా ప్రయాసపడకుండానే అక్కడివారు నన్ను సమర్థించడానికి సుముఖత చూపించారు.

మేమంతా కలిసికట్టుగా ప్రక్క కంపార్టుమెంట్‌లోకి వెళ్ళాం. అంత్యాక్షరి యువకులు పాటలు ఆపి మావైపు ప్రశ్నార్థకంగా చూశారు. మాలో ఒకాయన అందుకున్నాడు – "ఏం బాబు మేము ఈ ట్రైన్‌లో ప్రయాణం చెయ్యాలా వద్దా? అల్లరికీ, ఆటకీ ఒక హద్దు వుంది. ఏమిటా పాటలు – ప్రక్కవాడు ఏమైపోతాడా అనైనా లేకుండా?"

ఆ యువకుల నుండి నోటి మాట లేదు. అవతల రెస్పాన్స్ లేకపోవటంతో ఇంకో వ్యక్తి కల్పించుకొంటూ "మీరు మరీ ఇంత విచ్చలవిడిగా ప్రయాణం చెయ్యదల్చుకుంటే. ఏదైనా సెపరేట్ వెహికల్ ఏర్పాటు చేసుకోవాల్సింది" అన్నాడు.

"ఎంతసేపని సహించగలం?"

"గంట నుండి చూస్తున్నాం – మరీ ఇంత అదుపులేని అల్లరా?"

"నింతకాలానికి నిద్దూరవు పిల్లలు"

"చైన్ లాగి న్యూసెన్స్ కేసు క్రింద దింపించేస్తే సరి"

ఇలా – ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారు.

అబ్బాయిల్లో చలనం కల్గింది. పరిస్థితి మరీ శృతిమించకుండా మధ్యలో కల్పించుకొని చెప్పారు.

"జంటిల్‌మెన్ నియార్ సోసారి! నిజంగా మీకింత ఇబ్బందిని కలిగిస్తున్నామని ఊహించలేకపోయాం. ఏదో కుర్రకారు ఉత్సాహం కదా సరదాల్లోపడి పరిసరాలు గమనించకుండా ప్రవర్తించాము. ఇకమీదట అలా చెయ్యమని హామీ ఇస్తున్నాం. మీరు నిశ్చింతగా మిగతా ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. సారీ వన్స్ ఎగైన్" – చేతులు జోడించారు.

మేమంతా రిలీఫ్‌గా నెనక్కి నిష్క్రమించాము.

వ్యవహారం మరీ ఇంత తేలిగ్గా ముగుస్తుందని అనుకోలేదు.

మెజారిటీ మంది తప్పదు వడతని వ్యతిరేకిస్తే విజయం కాక మరేమిటి?

సమయం, సందర్భం, బలం కలిసిరానిచోట ఒకోసారి సత్యానికి కూడా ఓటమి తప్పదు.

కాని మనిషిలో మొదట ఎదుటివ్యక్తి పట్ల నెగటివ్ థింకింగ్ నశించిపోవాలి.

పై సందర్భం తప్పని వేలెత్తి చూపమని ప్రోత్సహిస్తోంది. అసందర్భపు అల్లరికి ఎదురుదెబ్బలు తప్పవని ఋజువుచేస్తోంది! చివరికిలా మనుషుల పట్ల విముఖతని తొలగిస్తూ నా తర్కం ఓ ప్రశాంత తీరాన్ని చేరుకుంది.

రకరకాల మనుషుల నుండీ వీడ్కోలు పలుకుతూ మా లింకు ట్రైన్ కూడా గమ్యాన్ని చేరింది.

ఈ స్వల్ప ప్రయాణం పై అనుభవాన్ని నాకో వింతైన అనుభూతిని మిగిల్చింది!